స్టేట్ రీసోర్స్ పర్సన్‌గా విజయభాస్కర్



చాదర్‌ఘాట్: హైదరాబాద్ జిల్లా స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) డాక్టర్ ఎన్.విజయభాస్కర్ స్టేట్ రీసోర్స్ పర్సన్‌గా ఎంపికయ్యారు. 33 జిల్లాలలో ఉన్న భాష పండితులకు స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి వినూత్న పద్ధతిలో బోధించడానికి రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ ఇవ్వడానికి 10 మంది తెలుగు రీసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేయగా పాతబస్తీ నుంచి విజయభాస్కర్ ఎంపికయ్యారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తిచేసి కాలనీవాసుల ఇబ్బందులు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ విగ్నేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీల నాయకులు మోహన్‌రెడ్డి, హరీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయ మార్కెట్‌లో సెక్యూరిటీని పెంచాం



దామోదర్

చాదర్‌ఘాట్: రాత్రి వేళల్లో మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో సెక్యూరిటీని పెంచామని ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో రైతులు, మిర్చి, ఉల్లి గడ్డల బస్తాలు దిగుమతి చేసుకొని నిద్రపోయే సమయంలో ఆకతాయిలు దొంగతనాలకు పాల్పడుతున్న నేపథ్యంలో అదనంగా సెక్యూరిటీ పెంచామన్నారు. అవసరమున్న చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

అవయవదానం



ఆవుల అలివేలు (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపింది ఓ గృహిణి. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా గోట్టిముక్కల గ్రామానికి చెందిన ఆవుల అలివేలు (49) ఈ నెల 23న ఇంట్లో ఆకస్మాతుగా కింపడిపోయింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కామినేని హాస్పిటల్‌కు తరలించారు. ఎమర్జెన్సీలో ఉంచి చికిత్స అందించినప్పటికీ చికిత్సకు స్పందించకపోవడంతో ఈ నెల 28న బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. అలివేలు భర్త వెంకటయ్య, కుటుంబ సభ్యుల అంగీకారంతో అలివేలు లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీవన్‌ధాన్‌కు ప్రదానం చేశారు.

108 రోజుల ఉచిత వైద్య పరీక్షలు

నాగోలు: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట, ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో నగరంలో 108 రోజులు ఉచిత వైద్య సేవలకు శ్రీకారం చుట్టిందని డాక్టర్ విజయరంగ ఓ ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, లయన్స్‌క్లబ్, లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద మధ్య తరగతి ప్రజలకు ప్రతి రోజు వివిధ కాలనీలు, బస్తీలో శిబిరాలు నిర్వహించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

బాధ్యులను శిక్షించాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్–1) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం మంగళవారం కోఠి డీఎంహెచ్‌ఎస్‌లోని సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు. అనంతరం సాయిరెడ్డి మాట్లాడుతూ..పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్నపై జరిగిన సంఘటనపై తమ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇది వైద్య ఆరోగ్యశాఖపై జరిగిన దాడిగా పరిగణించి ప్రిన్సిపల్ సెక్రెటరి, ఆరోగ్యశాఖ మాత్యులు తక్షణం స్పందించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలో పనిచేస్తున్న హెచ్–1 నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలను ఖండిస్తున్నామన్నారు. జీఓ నెంబర్ 142 వైద్య ఆరోగ్య శాఖ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుదర్శన్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, సోమయ్య, సుజాత, సరిత, రాములు, సందీప్, శుభకరణ్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవం.. బ్రహ్మోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధి వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ (ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, బాలభోగ మంగళాశాసనం, తీర్థ ప్రసాదగోష్టి, ఇష్టి యాగశాలలో పూజలు, లక్ష్మీనారాయణ ఇష్టహవనం, ప్రధాన యాగశాలలో మూర్తి కుంభస్థాపన, చతుస్థానార్చన, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి, ధ్వజారోహణ, బలిహరణ, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సోమ సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరీశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్ పాల్గొన్నారు.



అష్టలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక హోమం



స్వామివారి పల్లకి సేవ

ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు కల్పిస్తా



పాఠశాల సందర్శించిన వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట ప్రాథమిక పాఠశాలలో రూ 10 లక్షలతో పాఠశాల ఆవరణలో ఫ్లోరింగ్, గ్రీనరీ, వాల్ పెయింటింగ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మొట్టమొదటి సారిగా పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యను ప్రవేశ పెట్టి ప్రత్యేక శ్రద్ధ వహించిన హెచ్‌ఎం అనంతరెడ్డిని అభినందించారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పనులు పూర్తి చేయాలి



పనుల ప్రారంభోత్సవంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ హరిపురి కాలనీ రోడ్డు–1లో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను ప్రజలకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని కాలనీ అసోసియేషన్ సభ్యులు గత ఎన్నికల ముందు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకురాగా రూ. 20 లక్షలతో టెండర్‌ను మంజూరు చేయగా మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవింద్ శర్మ మాట్లాడుతూ.. ఈ పనులు పూర్తయితే మురుగు సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శ్యాంగుప్తా, పెద్ది శ్రీనివాస్ గుప్తా, మురళి, కృష్ణమూర్తి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, యాదగిరి, వంశీ, అనిలకుమార్, యాదగిరి రెడ్డి, సుంకర రవి, రంగాచారి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో దీక్ష విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

చైతన్యపురి: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఎల్‌బీనగర్‌లోని దీక్ష జూనియర్ కళాశాల రాష్ట్రస్థాయిలో సత్తా చాటినట్లు కరస్పాండెంట్ రాజు తెలిపారు. బైపీసీ విభాగంలో బి.సహస్ర 440 మార్కులకు 438, వి.వర్ధని 470 మార్కులతో రెండవ ర్యాంకు సాధించారన్నారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో ఏ.కార్తీక్ 470 మార్కులకు 467 సాధించి స్టేట్ మూడవ ర్యాంక్ సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో ఎస్.హర్షిత 993, జె.అక్షయ 992 మార్కులు సాధించగా ఎంపీసీలో డి.వినోన్న 990, టి.మేఘన 989 మార్కులతో ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

ఎన్ని ఇబ్బందులు పెట్టినా సభ జయప్రదమైంది

ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే సబితారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా రజతోత్సవ సభ విజయవంతమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశమై సభ విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సభ ద్వారా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం కార్యకర్తల్లో నూతన ఉత్తేజం నింపిందని, మరో మూడేళ్ల ప్రజల పక్షాన పోరాడుదామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. నక్సలైట్ల సమస్యపై కేసీఆర్ ప్రస్తావించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏదీ పూర్తి స్థాయిలో అమలుకాలేదని, గత ప్రభుత్వ పథకాలే ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పలేని పరిస్థితిలో మంత్రులు, నాయకులు ఉన్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు బనాయించిన బీఆర్‌ఎస్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ అబ్దుల్‌రవూఫ్

పహాడీషరీఫ్: గత ప్రభుత్వ హయాంలో ప్రజాసమస్యలపై పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని కాంగ్రెస్ పార్టీ జల్‌పల్లి మున్సిపల్ సీనియర్ నాయకుడు సయ్యద్ అబ్దుల్ రవూఫ్ అన్నారు. ఉస్మాన్‌నగర్‌లోని బురాన్‌ఖాన్ చెరువు ముంపు విషయంలో నిరసన తెలిపినందుకుగాను పార్టీ సీనియర్ నాయకురాలు ఇందిరాశోభన్, ఉజ్మా షకీరా, రవూఫ్ సహా ఎనిమిది మందిపై కేసులు నమోదయ్యాయన్నారు. ఈ క్రమంలో ఆమెతో పాటు జల్‌పల్లి నాయకులు రవూఫ్, ఎం.ఏ. బారీలు అడ్వకేట్ ఉదయ్‌కిరణ్‌తో కలిసి మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టుకు హాజరయ్యారు. కుట్రపూరితంగా పెట్టిన ఈ కేసులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి కొట్టేసేలా చూడాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని వరంగల్ సభలో గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.15, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.19, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.17, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.28, కందగడ్డ రూ.75, బీట్‌రూట్ రూ.15, కీర రూ.28, బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

మర్యాదపూర్వక కలయిక

లింగోజిగూడ: జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆర్‌వీ కర్ణన్‌ను మంగళవారం తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

చంపాపేట: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు మంగళవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానంజనేయ స్వామివారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కౌశిక్‌రెడ్డి దంపతులను వేదమంత్రోశ్చరణలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ పాలకమండలి సభ్యులు మధుసాగర్, మేక సురేందర్‌రెడ్డి, అర్చకులు శంకర్ ప్రసాద్, అంబాప్రసాద్, చంద్రకాంత్, ముత్యాలశర్మ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరద నాలాల్లోని పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని వరద కాలువల్లో తీస్తున్న పూడికను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు నాలాలు పొంగి పొర్లకుండా ముందస్తుగా పూడికను తొలగిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: పేద ప్రజాల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భద్రతను ఇస్తుందని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్కు కాలనీకి చెందిన రజినికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.42,500 చెక్కును మంగళవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, యశ్వంత్ రాజ్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



రాజేశ్

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి గ్రామానికి చెందిన దేవసాని రాజేశ్(24) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య ప్రియాంకతో కలిసి ఎఫ్‌సీఐ కాలనీలోని చాందిని విహార్‌లో ఉంటున్నారు. ఈ నెల 24న శ్రీశైలం వెళ్తున్నాని ప్రియాంకకు చెప్పి వెళ్లిపోయాడు. ఐదు రోజులైనా ఇంటి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. ఆందోళనకు గురైన ప్రియాంక బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తా



పెన్షనర్లను సత్కరిస్తున్న దయానంద్‌గుప్తా

చైతన్యపురి: రాష్ట్రంలోని పెన్షనర్లు ఎదుర్కుంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ 10వ వార్షిక సమావేశం చైతన్యపురి సాయినగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ సేవా సమితి భవన్‌లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. సీనియర్ పెన్షనర్ల కుటుంబాలకు రేషన్ కార్డులు, ఆరోగ్య సమస్యలు ఉంటే నిమ్స్‌లో చికిత్సలు అందేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి, నాయకుడు కాచం సత్యనారాయణ, అఖిల భారత అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు గూడూరి సీతమహాలక్ష్మి పాల్గొన్నారు.

మేడే వేడుకలను జయప్రదం చేద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

మన్సూరాబాద్: వాడవాడల్లో మేడే వేడుకలను జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రమావత్‌సక్రునాయక్ పిలుపునిచ్చారు. డివిజన్ పరిధి ఆటోనగర్‌లో మంగళవారం ఆయనతో పాటు ఏఐటీయూసీ హయత్‌నగర్ మండల కార్యదర్శి గొల్కొండ నాగరాజు హాజరై మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26.500 వేలు చెల్లించాలని, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలన్నారు. పర్మనెంట్ కార్మికులకు ఇచ్చే విధంగా కాంట్రాక్ట్ కార్మికులకూ షూస్, చీపుర్లు, శానిటైజర్లు, కొబ్బరినూనె, సబ్బులు, ఇతరాత్ర సామగ్రి ఇవ్వాలన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు స్వచ్ఛందగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, నాగన్న, రాజ్‌కుమార్, వెంకటేష్, బిక్షపతి, సుగుణమ్మ, బాలమణి పాల్గొన్నారు.

ప్రదీప్‌కుమార్‌కు గిన్నిస్ బుక్‌లో చోటు



సర్టిఫికెట్‌తో ప్రదీప్‌కుమార్

మలక్‌పేట: అక్బర్‌బాగ్‌కు చెందిన తవిటికి ప్రదీప్‌కుమార్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 2024 డిసెంబర్ 1న మిస్టర్ అగస్టీన్ దండింగి వేణుగోపాల్, హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రపంచ స్థాయి సంగీత కార్యక్రమం నిర్వహించారు. 18 దేశాలకు చెందిన 1,046 మంది కీబోర్డు ప్లేయర్లు పాల్గొన్నారు. ఇందులో మలక్‌పేటకు చెందిన ప్రదీప్‌కుమార్‌తో పాటు మరికొందరి ఖ్యాతిని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. హైదబాద్‌లోని లైఫ్ చర్చిలో క్రైస్తవ పెద్దల ద్వారా సర్టిఫికెట్ అందజేశారు. మంగళవారం మలక్‌పేట హోరేబు చర్చి పాస్టర్ బ్రదర్ గడ్డం మోజెస్, తల్లిదండ్రులు అప్పలరాజు, ఇందిరఫ్లోరెన్స్, పలువురు ప్రదీప్‌కుమార్‌ను అభినందించారు.

వరదనీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం



పనులు పరిశీలిస్తున్న జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీలు న్యూగడ్డిఅన్నారం, కమలానగర్ ప్రాంతాల్లో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. న్యూగడ్డిఅన్నారం, కమలానగర్, నేతాజీనగర్ చౌరస్తా వరకు రూ. 2 కోట్ల వ్యయంతో చేపట్టిన స్టామ్‌వాటర్ లైన్ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ.. స్టామ్ వాటర్ లైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు పరిశీలిస్తూ ఉండాలన్నారు. కమలానగర్ కాలనీవాసులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. కాలనీల్లో ఇళ్లముందు ఏర్పాటు చేసుకున్న ర్యాంపులు, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను ఇళ్ల యజమానులే స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, సర్కిల్ డీసీ సుజాత, ఈఈ శ్రీనివాస్, డీఈ విజయ్, ఏఈ రూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఎండ మండింది.. ట్రాన్స్‌ఫార్మర్ పేలింది..

రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. లింగోజిగూడ ఓల్డ్ విలేజ్ ప్రధాన రహదారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం వేడిమితో ఒక్కసారిగా పేలడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తుండగా మరోసారి పేలడంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 30 నిమిషాల పాటు శ్రమించి మంటలను ఆర్పేశారు.

– లింగోజిగూడ

